# అమ్మ

శనివారం ఉదయం తొందరగా స్నానం ముగించి పూజకోసం గన్నేరు పూలు, తులసి దళాలు కోస్తున్న శేషారత్నం చూపులు  చంకలో చంటిబిడ్డలను చేతిలో అన్నం కారియర్లను మోసుకుంటూ వురుక్కుంటూ పోతున్న ఆడకూలీల మీద వాలడంతో ఆవిడ క్షణకాలం చేస్తున్న పని ఆపేసి వాళ్ళను చూస్తూ నిలబడి పోయింది.

"అధిక వైశాఖ మాసంలో మండి పోతున్నాయి ఎండలు. పగలు వేడికి అన్నం సహించదు. రాత్రి ఉడకపోత వలన నిద్ర సరిగ్గా ఉండదు. ఇంట్లో వుండే మేమే ఇంతగా అల్లాడిపోతుంటే మట్టి పనులకు, చేలో పనులకు వెళ్ళే వీళ్ళ మాటేవిటి? కన్నబిడ్డలకు కడుపునిండా తిండి పెట్టాలన్న తాపత్రయంతో ఏ కష్టాన్నీ లెక్కచేయరు పాపం!" అనుకుంటూ నిట్టూర్చి పూలబుట్ట పట్టుకుని లోపలికి వస్తుంటే ఫోను మోగింది.

'ఇంకెవరు నిరుపమ బంగారు తల్లే అయివుంటుంది. శనివారం సెలవు రోజు కదా! లేవగానే అమ్మ గుర్తుకొస్తుంది దానికి' అనుకుంటూ కూతురి తలపుతోనే మనసు నిండి పోగా తనవయసు మరచి పోయి రెండు అంగల్లో వెళ్ళి ఫోను అందుకుంది శేషారత్నం.

"అమ్మా! శనివారం అప్పుడే పూజకు సిద్ధం చేసుకుంటున్నావా? ఇక ఈరోజంతా ఉపవాసం చేస్తావు కదూ! అసలే ఎండాకాలం.... నీరసపడి పోతావమ్మా!" నిరుపమ గొంతులో ప్రేమ పలికింది.

"ఉపవాసమంటే మరీ పచ్చి మంచినీళ్ళు కూడా త్రాగకుండా వుంటున్నానా ఏమిటే? పాలు; పళ్ళు తీసుకుంటాను కదా.... సరే పిల్లలెలా వున్నారు? అన్నదావిడ మాట  మారుస్తూ.

"వాళ్ళకేం హాయిగా పోట్లాడుకుంటూ, మల్లయుద్ధాలు చేస్తూ మమ్మల్ని తింటున్నారు"  నవ్వేసింది నిరుపమ.

"పిల్లలన్నాక పోట్లాడుకోకుండా వుంటారా? సరేగానీ చిన్నదానికి కాయగూరలు, ఆకుకూరలు చేసి పెడుతున్నావా లేదా? ఇప్పటినుండే అన్నీ అలవాటు చెయ్యి ఆరోగ్యంగా వుంటుంది." అచ్చం అమ్మమ్మలా చెప్పిందావిడ.

"దానికి అన్నం పెట్టే సరికి ఒక యజ్ఞం చేసినంత పని కదా! నాకు నీరస మొచ్చేస్తుంది.  ఏ కూరలు నచ్చవు... మొండికేస్తుంది. ఏం చేయను?" నిరుపమ విసుగ్గా అంది.

"అవునే.... దానికి నీ పోలికే వచ్చింది మరి. నువ్వు మాత్రం తక్కువ ఏడిపించావా నన్ను?" శేషారత్నం నవ్వుతూ అంది.

"అన్నట్టు నీ మనవడు ఇవాళ నామీద ఒక బాంబు పేల్చాడు తెలుసా అమ్మా? నాకు వాడంటే ఇష్టం లేదుట. చెల్లాయంటేనే నాకు ప్రేమ ఎక్కువట. "యుడోంట్ లవ్ మి ఎనీ మోర్ అనేసాడు చాలా సీరియస్‌గా" నిరుపమ చెప్తున్నదల్లా ఒక నిముషం నిశ్శబ్దంగా వుండి పోయింది.

ఆ నిశ్శబ్దాన్ని వింటున్నట్టు శేషారత్నం మౌనం వహించింది.

"పతంజలి మావయ్య బాగున్నాడామ్మా చాలా రోజులయింది మావయ్యను చూసి." హఠాత్తుగా అంది నిరుపమ.

"బావున్నాడే.... మొన్న ఈ ఊరు వచ్చినపుడు ఒక రోజు ఇక్కడ వుండి వెళ్ళాడు" అంది శేషారత్నం కూతురు మనసు చదివినట్టే. ఫోను పెట్టేసాక పూజ ముగించి కాఫీ త్రాగుతూ కూర్చున్న శేషారత్నంకు నిరుపమ మాటలు మళ్ళీ గుర్తొచ్చాయి. ప్రతి చిన్న విషయానికి అలిగి, మొండి చేసే నిరుపమ ఇవాళ ఇద్దరు బిడ్డల తల్లి! ఎంత త్వరగా పిల్లలు ముగ్గురూ పెద్దవాళ్ళయి పోయి జీవితంలో స్థిరపడిపోయారని తలచుకున్నప్పుడు ఆవిడకు ఆశ్చర్యంగా అనిపిస్తుంది. 'రెక్కలొచ్చిన పక్షులు ఎగిరిపోయి వాటి గూడు అవి కట్టుకుని బ్రతకడం సహజం కదా' అని తేలికగా నవ్వేస్తాడు రాజారావు.

శేషారత్నం రాజారావుల ముగ్గురు పిల్లలలో రెండోది నిరుపమ. మొదటి అమ్మాయి వందనది చిన్నతనం నుండి నలుగురి కలిసి పోయే తత్వం ఒకరి నొప్పింపక, తానొవ్వక చిరునవ్వుతో కలివిడిగా వుండి తనపని జరిపించుకునేది. ఇద్దరాడ పిల్లలు తరువాత పుట్టాడు రేవంత్. ఆఖరిబిడ్డ, అందులో మగపిల్లవాడు, అందులో అమ్మకూచి అయిన రేవంత్ నోరు తెరిచి ఇది కావాలని అడిగే పని లేకుండాఅన్నీ అమరిపోతుంటాయి. నిరుపమది తండ్రి రాజారావు పోలిక, మితభాషి. సుఖమైనా దుఃఖమైనా మనసులోనే దాచుకుంటుంది. తనకు నచ్చని విషయంలో మొండిగా ఎదురు తిరుగుతుంది.

యవ్వనారంభ దశలో ఆడపిల్లలలోనూ, మగ పిల్లలలోనూ శారీరకంగా, మానసికంగా పలుమార్పులు చోటుచేసుకుంటాయి. ఒక్కొక్క సారి వారి ప్రవర్తనలో ఆలోచనలో విపరీత ధోరణి కూడ కనబడుతుంది. పదహారేళ్ళ నిరుపమ విషయంలో ఇదే జరిగింది.

అమ్మా నాన్నల అభీష్ట ప్రకారం వందన లెక్కల గ్రూపుతో ఇంటరు పూర్తిచేసి, ఎమ్.సెట్‌లో ర్యాంకు సాధించి కంప్యూటరు ఇంజనీరింగులో సీటు సంపాదించింది.

నిరుపమను డాక్టర్ని చేయాలని ఎంతగానో ఆశపడింది శేషారత్నం. నేను బి.కాం చదివి, సి.ఎ. చేస్తాను అంటూ పట్టుబట్టింది నిరుపమ. సి.ఇ.సి. గ్రూపుతో ఇంటరు డిస్టింక్షన్‌తో పాసై బి.కాం.లో చేరింది. ఆ పిల్లను డాక్టరుగా చూడాలన్న కోరిక తీరక నిరాశ చెందినా కూతురి అభిరుచిని కాదనలేదు తల్లిదండ్రులు.

అమ్మ ఆశ తీర్చడానికి రేవంత్ ముందుకొచ్చాడు. బై.పి.సి. గ్రూపుతో ఇంటరు చేరాడు. మొదటి సంవత్సరం నుండే మెడికల్ ఎంట్రెన్స్ పరీక్ష కోసం సిద్ధం కావడం మొదలు పెట్టాడు.

రాజారావు పనిచేసేది రైల్వేస్‌లో. నెలలో ఇరవై రోజులు తిరగవలసిన ఉద్యోగం అతనిది. శేషారత్నం జీవితభీమా సంస్థలో పనిచేస్తుంది. ఆఫీసరుగా ప్రమోషను వచ్చాక ఆమెకు బాధ్యతలు పెరిగాయి. ఇంట్లో ముగ్గురు పిల్లల చదువులు, గృహనిర్వహణ, బయట ఆఫీసు పనులతో సతమతమై పోయేది.

"నీరూ! కాలేజి నుండి రాగానే మళ్ళీ ఆ కంప్యూటరుకి అతుక్కుపోవడమేనా? పనిమనిషి గిన్నెలు కడిగి పెట్టింది. అవి లోపలికి తీసుకొచ్చి పెట్టి, చాకలి బయట ఆరేసిన బట్టలు తీసి మడత పెట్టొచ్చుకదా!" కంప్యూటరు ముందు కూర్చుని టీ త్రాగుతూ స్నేహితులతో 'చాటింగ్'లో మునిగి పోయిన నిరుపమను గట్టిగా విసుక్కుంది శేషారత్నం.

"ఏం అక్కకు చెప్పొచ్చు కదా ఆపనులు... ఎప్పుడూ నన్నే అంటావు. నేనెంత పనిచేసినా నీకు కనబడదు" నిరుపమ అంతే దూకుడుగా సమాధానమిచ్చింది.

"అక్కకు సెమిస్టర్ పరీక్షలు మొదలవుతున్నాయి. చదువుకోవద్దా? అయినా పాపం అది సాయంత్రం రాగానే రాత్రికి కూరగాయలు తరిగి పెట్టింది." అంది శేషారత్నం.

"అవును.... దానికి సెమిస్టర్ పరీక్షలు. వాడికేమో ఎమ్‌సెట్ పరీక్షలు. నేనేగా పనికిరాని చదువు చదువుతున్నది." అక్కసుగా జవాబిచ్చిందే గానీ కూర్చున్న చోటునుండి కదలలేదు నిరుపమ.

అరగంట తరువాత శేషారత్నం విసురుగా వెళ్ళి పాత్రలన్నీ కడిగి తెచ్చి వంటింట్లో సర్దిపెట్టింది. బయట దండెంమీద వున్న బట్టలన్నీ తీసుకొచ్చి హాల్లో సోఫా మీద గుట్టగా వేసి మడత బెట్టసాగింది. చూసీ చూడనట్టు వూరుకుంది నిరుపమ.

"అమ్మా ! నేను మడిచి పెడతానులే నువ్వు వెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకో..." తల్లి దగ్గరగా వచ్చి భుజం చుట్టూ చేయి చుట్టి అంది వందన.

"నేను విశ్రాంతిగా కూర్చుంటే రాత్రికి వంటెవరు చేస్తారు? ఇంట్లో ఏ బాధ్యతా తీసుకోని వాళ్ళకు కూడా కంచంలో వడ్డించి అందించడం నాకు తప్పదు కదా!" అనేసి లోపలికి వెళ్ళిందావిడ.

నిరుపమ కంప్యూటర్ షట్‌డౌన్ చేసి వెళ్ళి తన గదిలో మంచం మీద బోర్లా పడుకుంది. అరగంట తరువాత రేవంత్ ట్యూషన్ నుండి రాగానే తల్లి వాడికి టిఫిన్ పెట్టి, హార్లిక్స్ కలిపి ఇచ్చి ఉపచారాలు చేయడం ఆపిల్ల చెవిన పడుతూనే వుంది. రాత్రి అందరూ డైనింగ్ టేబులు దగ్గర సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తుంటే 'నాకు ఆకలిగా లేదు' అంటూ మొండిగా తన గదిలో వుండి పోయింది.

ఈ గొడవ సద్దు మణగడానికి నాలుగు రోజులు పట్టింది.

"అమ్మా .... మాక్లాస్ వాళ్ళు ఎక్స్‌కర్షన్ వెళ్తున్నాం. రెండు వేలు కావాలి" అంటూ పొద్దున్నే టెండరు పెట్టింది నిరుపమ.

రేవంత్ కోచింగ్‌కు ముప్పైవేలు కట్టాము మొన్ననే... పై నెలలో అక్క కాలేజి ఫీజు కట్టాలి. ఈ నెలలో కంప్యూటరు క్లాసుకని రెండువేలు తీసుకున్నావు. మళ్ళీ ఇప్పుడు

పిక్నిక్‌లు ఎక్స్‌కర్షన్‌లు అంటే ఎక్కడ నుండి తేవాలి డబ్బు? కాస్త ఆలోచించవద్దా?" శేషారత్నం మందలింపుగా అంది.

"అవున్లే నీ పెద్దకూతురు మేధావి ఇంజనీరింగు చదవుతోంది. ఎంతైనా ఫీజు కట్టాల్సిందే. లేక లేక పుట్టిన మగపిల్లవాడు.... వాడికి కాకపోతే ఎవరికి పెడతారు? ఇద్దరి నడుమ పుట్టడం నా దురదృష్టం. నాదాకా వచ్చేసరికి డబ్బులుండవు మీ దగ్గర." ఉక్రోషంగా అనేసి కాలేజికి వెళ్ళి పోయింది నిరుపమ.

ఆ రోజు సాయంత్రం ఏడుగంటలయినా నిరుపమ ఇంటికి రాక పోవడంతో కంగారు పడిపోయింది శేషారత్నం. రాజారావు ఊళ్ళో లేడు. కాలేజికి, నిరుపమ స్నేహితురాళ్ళకు ఫోను చేసింది. ఎవరూ ఆపిల్ల గురించి వివరం చెప్పలేకపోయారు.

శేషారత్నంకు కాళ్ళు చేతులు ఆడడం లేదు. కూతురు గదిలోకి వెళ్ళి దాని టేబులు, పుస్తకాలు చూసింది. బల్ల సొరగులో వున్న నిరుపమ డైరీ కనబడగానే ఏదో అనుమానంతో పేజీలు త్రిప్పింది ఆమె.

"అమ్మకు అక్క అంటే అపురూపం. రేవంత్ అంటే ప్రాణం. ఎందుకో నేనంటే మాత్రం ఇష్టం లేదు. ఎప్పుడూ నన్ను తిడుతూనే వుంటుంది. నేను ఇల్లంతా సర్దిపెడితే మెచ్చుకోదుగానీ అక్క వంటింట్లో సహాయం చేస్తుందని మురిసిపోతుంది. నాన్న ఎప్పుడూ ఆఫీసు పని అని తిరుగుతుంటారు. నాకెవ్వరూ లేరు. ఎవరితో చెప్పుకోవాలి నేను? నేను ఏడిస్తే ఓదార్చే వాళ్ళు లేని ఈ ఇంట్లో వుండాలనిపించడం లేదు" అని రాసుకుంది ఆరోజు.

"ఈ పిల్ల ఎక్కడికి వెళ్ళిపోయింది? ఏమి అఘాయిత్యం చేయదు కదా... భగవంతుడా నువ్వే దిక్కు" అనుకుంటూ దుఃఖం పట్టలేక ఏడుస్తూ కూర్చుంది శేషారత్నం.

కాసేపటికి తేరుకుని పక్కనే నంద్యాలలో వున్న తన తమ్ముడు పతంజలికి ఫోను చేసింది.

"ఏదో పిక్నిక్ కోసమని డబ్బులడిగితే ఇవ్వలేదని కోపంగా కాలేజీకి వెళ్ళిందిరా నిరుపమ. ఇంతవరకు ఇంటికి రాలేదు. అక్కడికేమయినా వచ్చిందా?" ఆదుర్దాని, ఆందోళనను అణుచుకుంటూ అడిగింది.

ఒక క్షణం నిశ్శబ్దంగా వుండిపోయాడు పతంజలి. "మాట్లాడవేమిరా? నిరుపమకు నీ దగ్గర చనువెక్కువ. అందుకే అక్కడకు వచ్చిందేమో అని అడుగుతున్నా..." ఆశ నిరాశల మధ్య ఊగిసలాడుతున్నది శేషారత్నం మనసు.

"లేదక్కా నేను బయల్దేరి రానా? బావగారు ఊర్లో లేరా? ఎక్కడికి వెళ్తుందిలే అక్కా. నువ్వు కంగారు పడకు. చిన్న పిల్ల కాదుగా స్నేహితుల ఇంట్లో వుందేమో..." ధైర్యం చెబుతూ అన్నాడు.

"లేదురా.... నేను గంటలో నీ దగ్గర వుంటాను. ఇద్దరం కలిసి ఆలోచిద్దాం.." అంటూ ఫోను పెట్టేసి టాక్సీని పిలిపించి వందనకు రేవంత్‌కు జాగ్రత్తలు చెప్పి బయల్దేరింది

శేషారత్నం. భర్తకు ఈ విషయం ఫోనులో చెప్పి గాభరా పెట్టదలచుకోలేదామె.

తనకోసమే ఎదురు చూస్తున్నట్టు హాల్లో పచార్లు చేస్తున్న తమ్ముడిని చూడగానే ఆవిడకు దుఃఖం ఆగలేదు.

"దానికి నేనేం తక్కువ చేసానురా? కళ్ళలో పెట్టుకుని పెంచాను. నీకు తెలుసుగా అది నాకడుపున పడినప్పుడు నేనెంత నీరసంగా వున్నానో... ఇంకా వందనకు ఏడాది నిండలేదప్పుడు. డాక్టరు 'తల్లి ప్రాణం దక్కాలంటే అబార్షన్ చేయించుకోండి' అంది. నాకేమైనా ఫరవాలేదని బిడ్డ మాత్రం కావాలని చెప్పాను. ఎనిమిదో నెలలోనే పుట్టిందది. తిండీ నిద్రామాని కాపాడుకున్నాను. అయిదేళ్ళు వచ్చేదాక ఎప్పుడూ ఏదో ఒక అనారోగ్యంతో ఎముకల గూడులా వుండేది. చ్యవన ప్రాసనా, తేనెనా, కంప్లానా ఎవరేది చెబితే అది పెట్టి అల్లారు ముద్దుగా, అరచేతిలో వెన్నముద్దలా కాపాడుకున్నాను. నాకు అదంటే ఇష్టం లేదుట. దానికి ఆ ఇంట్లో ఎవరూ లేరుట...... ఇక నేనెందుకురా బ్రతకడం? నిరుపమకేమైనా అయితే నా ప్రాణాలు నిలవవురా... ఎక్కడున్నా తీసుకురారా. చచ్చి నీ కడుపున పుడతానురా.." అణచుకోలేని భావోద్వేగంతో చిన్నపిల్లలా వెక్కిళ్ళు పెడుతోంది శేషారత్నం.

పతంజలి అక్కగార్ని భుజం చుట్టూ చేయివేసి లాలనగా తలనిమిరాడు గానీ మాట్లాడలేదు.

"అమ్మా" అంటూ పక్కగదిలో నుండి పరుగెత్తుకు వచ్చింది నిరుపమ. ఆ పిల్ల కళ్ళు ఎఱ్ఱగా వున్నాయి ఏడ్చి ఏడ్చి వాచి పోయి వున్నాయి.

చివ్వున తలెత్తి చూసిన శేషారత్నం కూతుర్ని చూడగానే రెండు చేతులూ జాపి కౌగిలిలోకి తీసుకుంది.

"ఎందుకిలా చేసావే? ఇంకాసేపు నువ్వు కనబడక పోతే ఈ అమ్మ నీకు వుండేది కాదు" కూతురి చెంపలు పుణికి, చెక్కిలిమీద ముద్దు పెట్టుకుంటూ అంది ఆ తల్లి.

"నన్ను క్షమించమ్మా..." అంటూ ఏడుస్తోంది నిరుపమ." అమ్మ ప్రేమ అక్షయపాత్ర వంటిదమ్మా... ఎందరు బిడ్డలున్నా అందరికీ ప్రేమను పంచుతుంది. తనుకన్న సంతానంలో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అని ఎప్పుడూ అనుకోదు ఏ తల్లీ. అమ్మకు బిడ్డలంతా సమానమే తల్లీ. పిల్లల అవసరాన్ని బట్టి ఆదరిస్తుంది అమ్మ" అన్నాడు పతంజలి.

– – 0 – –

మళ్ళీ ఫోను మ్రోగడంతో ఆలోచనల నుండి తేరుకుంది శేషారత్నం. ఈసారీ నిరుపమే చేసింది. ఫోను తీయగానే " అమ్మా ఐ లవ్ యూ " అని చెప్పి పెట్టేసింది.

– 'చలువపందిళ్ళు' కథాసంకలనం జులై 2010